# చక్రభ్రమణం

## శ్రీమతి ఒగేటి (సత్యవాడ) ఇందిరాదేవి

"మేష్టారూ నా ఎస్సే దిద్దారా" అంటూ వచ్చాడు వాసు.

"అరె దిద్దలేదోయ్! ఈ మధ్య బొత్తిగా తీరిక లేని పనుల్లో పడి" అన్నాడు కామేశం.

"ఎల్లుండి రానండీ!"

"ఆఁ రా. రేపో ఎల్లుండో రా" అంటూ ఇంట్లో కెళ్ళిపోయాడు కామేశం.

పరీక్షలు దగ్గర కొచ్చేస్తున్నై. ఈయన ఎస్సే దిద్దడు-ఇవ్వడు. వక్కో ఎస్సే మూడు పేజీలైనా లేదు. పదేసి రోజులు పడుతుంది దిద్దటానికి- తిరగలేక దుంప తెగుతోంది" అని సణుక్కుంటూ పోయాడు వాసు.

ఇంట్లోకి పోయిన కామేశం తొందరగా తయారై జనార్ధనరావు గారింటికి బయల్దేరాడు.

ఆయన వాలుకుర్చీలో తీరుబడిగా కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు.

"సార్! నమస్కారం" అంటూ పలకరించాడు కామేశం.

"ఎవరూ. నువ్వటోయ్ కామేశం- రా-రా- ఏమిటీ మధ్య రావటల్లేదూ?" అంటూ కుశల ప్రశ్నలడిగాడు జనార్ధనరావు.

"ఏదో సార్! తెమలటల్లేదు-నా కాయితాలు-" అంటూ నసిగాడు కామేశం-

"ఏం కాయితాలు? ఓహో! అవా? బియ్యే పరీక్షకు వెళుతున్నాననీ ఏవో ఎస్సేలు ప్రిపేర్ చేసుకున్నాను- దిద్ది పెట్టమని ఇచ్చావు-- అవా? అరె- మరిచే పోయినానయ్యా సరేలే మూడు నాలుగు రోజుల్లో దిద్ది ఇచ్చేస్తా లే" అన్నాడాయన తేలికగా.

ప్రాణం కొట్టుకుపోయింది కామేశానికి-

ఎంతో కష్టపడి ఎస్సేలు రాపి దిద్ది పెట్టమని ఇస్తే మరిచేపోయా నంటా


దేమిటీయన. ఆఫ్టరాల్ వొక రెక్చరరు- ప్రొఫెసరు లా పోజులు కొడతాడు పెద్ద" అనుకుంటూ ఇంటికెళ్ళాడు.

"ఇతను ఎస్సేలంచే గుర్తు కొచ్చింది. నా థీసిస్ కాయితాలు దిద్దాడోలేదో మా గురుడు. కనుక్కొస్తా- తలుపేసుకో." అని భార్యకి చెప్పి బయల్దేరాడు జనార్దనరావు.

ప్రొఫెసరు కృషమాచారి జనర్ధన రావుకి గైడు. రెండుసార్లు బెల్లుమోగించాక ఆయన కూతురు మొహం బయట పెట్టి "నాన్నగారు లేరండీ. వూరి కెళ్ళారు" అన్నది.

ఉసూరుమని పోయాడు జనార్దన రావు-

"అలాగా? మొన్న వచ్చినప్పుడు వూరి కెళతానని అనలేదే మేష్టారు! మరే ఎప్పుడొస్తారు?" అని అడిగాడు.



"పదిహేను రోజులు పడుతుంది వచ్చేటప్పటికి" అని లోపలికి మాయమైందామె.

o o o

"రండి రండి- ఆచార్య వర్యా!" బోసినోరు తెరిచి నవ్వుతూ ఆహ్వానించాడు సదానంద శాస్త్రిగారు.

"అయ్యా- వున్నారా స్వామీ సమరు! నమో నమః" అంటూ సెవ్వుతూ నమస్కారం చేశాడు కృష్ణమాచారి.

"ఏమిటి? ఇవాళేనా రావటం?"

"కానండి. నేను రాసిన వేదాంత గ్రంథం ఎలాగుందో సెలవిచ్చారు గాదు. ఎన్ని ఉత్తరాలు రాసినా జవాబు లేదు. పోనీ- వొకసారి తమరిని దర్శించినట్లూ వుంటుంది- నా గ్రంథం సంగతి గుర్తు చేసుకున్నట్లూ వుంటుంది అని వచ్చాను." అసలు సంగతి చెప్పేశాడు కృష్ణమాచారి.

"ఏదీ- ఈ మధ్యన ఊపిరాడనిపని ఏడెనిమిదిమంది వాళ్ళు రాసిన పుస్తకాలు ఎలావున్నయ్యో చెప్పమని నెత్తిమీదకూచున్నారు. అవట్లా వుండగా అభిప్రాయ నివేదికకు రాయవలసినవి పది పుస్తకాలున్నై. మీ పుస్తకం ఇంకా చూడలేదండీ- పాపం అంత దూరం నించీ కష్టపడివచ్చారు. తొందర్లోనే చూసాను- అన్నట్టు ఈ పూట మా ఇంట్లోనే భోంచెయ్యాలి- లేవండి కాళ్ళు కడుక్కుందురుగాని" అంటూ మర్యాద చేశారు సదానంద శాస్త్రిగారు.

"భోజనం వొకటే తక్కువైంది. ఆరు నెలలైంది పుస్తకం ఇచ్చి. ఇంత వరకూ అతీగతీలేదు-" లోలోపలే ఉడుక్కుని పైకి "అలాగేనండీ" అన్నాడు కృష్ణమాచారి వినయంగా.

"మీరు వెళ్ళేప్పుడు నేను కూడా రావాలండీ మా వూరు- అక్కడమా అమ్మాయివుందిగా" అన్నాడు శాస్త్రి గారు

"నిత్తం- తప్పకుండా రండి" అన్నాడు కృష్ణమాచారి...

o o o


"అమ్మా! వీడెలా చదువుతున్నాడే-' వాసువి దగ్గరికి తీసుకుంటూ వాత్సల్యంగా అడిగారాయన కూతుర్ని- వొక్కడే మనవడు- మరి కావల్సినంత గారాబంమరి.

"ఏం చదువో ఏమో నాన్నా! వాడికి మీ సబ్జెక్టే రాదు- మిగిలినవన్నీ మంచి మార్కులేవస్తాయి గాని" అంది కూతురు.

"అదేమిట్రా - తాతకు అప్రదిష్ట తెస్తున్నావా?" అన్నారాయన నవ్వుతూ.

"కాదు తాతయ్యా! ఎంత పైరి చేసినా రావటల్లేదు - అక్కడికీ కష్టపడి ఎస్సేలుదాసి మామాస్టారి కిస్తానా- ఆయన తొందరగా దిద్దివ్వడు-ఎప్పుడూ ఆలస్యమే" అని ఇదైనాడు పిల్లవాడు.

"ఎవర్రా ఆమేస్టారు? రేపు వెళదాం పద - వాళ్ళింటికి" అన్నాడు తాత-




"సదానంద శాస్త్రిగారూ! మీరా సార్! ఆహా! ఎన్నాళ్ళకి చూశాను- దేశంలో మీకెంత పేరూ ఏంకథా" అంటూ కాళ్ళమీద పడిపోయినాడు. కామేశం - "తమ శిష్య ప్రశిష్య వర్గంలోని వాడినండీ" అని పరస చెప్పుకున్నాడు.

తను వచ్చిన పని మరచిపోయి కామేశం ఇచ్చే అతిథి సత్కారాలు స్వీకరించి, సంప్రీతుడై "ఇప్పుడేం చేస్తున్నావ్ నాయనా! నువ్వు" అని అడిగాడు శాస్త్రిగారు.

"ప్రైవేటుగా బియ్యేకి కడుతున్నా నండీ - ఏ హైస్కూల్లోనో జిల్లా పరిషత్‌లోనో ఉద్యోగం వస్తుంది గదాని. ఇంతకీ వాసు మీ మనవడాండీ? భలే చురుకైనవాడు లెండి, ఆంధ్రదేశంలో అంతపేరు పొందిన తమవంటి విద్యా వేత్తల మనవడు కదండీ మరి"

ఉబ్బిపోకూడదను కుంటూనే ఉబ్బి పోయినాడు శాస్త్రిగారు. "ఏమయ్యా! నా మనవడి ఎస్సేలు దిద్ది ఇవ్వటానికి తీరిందా నీకు?" అని గట్టిగా అడుగు దామని వచ్చినవాడే నిజానికి కాని——

"మరి పగలంతా స్కూల్లో సరిపో తుందేమో - ఎప్పుడు చదువుతావు పాపం" అని సానుభూతి ప్రదర్శిం చాడు.

"ఏదో తమలాంటివారి దయవల్ల అలాగే అవస్థ పడుతున్నానండీ- జనార్ధనరావు గారని నాకు తెలిసిన కాలేజీ లెక్చరరున్నారు - ఎస్సేలన్నీ రాసి వారిచేతి కిస్తానండి. కానీ పాపం వారికి దిద్దటానికసలు తీరికవుండటం

వేదంతే మిథ్యస - ఏందుకంటే ఆయినా రీసెర్చి వ్యవహారంలో మునిగి పోయి వున్నారు లెండి" అని సంగతంతా వివరించాడు కామేశం-

"జనార్ధనరావా? ఏ కాలేజీలో చెప్పేరు? అతని గైడు ఎవరో?" యధాలాపంగా అడిగారు శాస్త్రిగారు.

"వెంకటకృష్ణా కాలేజీ లోనండి. వారిగైడు కృష్ణమాచారి గారనుకుంటా- కానీ ఆయనకేమన్యా సరిగ్గా తీరుబడి దొరక్క జనార్ధనరావుగారు తయారు చేసి ఇస్తున్న థీసిస్ కరెక్ట్ చెయ్యటం లేదుటండీ పాపం - "అని చెప్పేడు కామేశం-

"కృష్ణమాచారా? మనిషి మంచి వాడేనే - విద్యార్థుల్ని డిస్కరేజ్ చెయ్యడే - ఎందుకు దిద్దటంలేదోగాని" అన్నారు శాస్త్రిగారు.

"కాదుటండీ పాపం - ఆచార్యులు గారు అపారమైన శిష్యవాత్సల్యం కలిగిన వారుటండీ - కానీ వారీమధ్య నేదో వేదాంత గ్రంథం వ్రాశారుటండీ- దాన్ని ఎవరో పెద్దలకి చదవమని ఇచ్చారుట - వారు చదివి ఓ కే - చేస్తే దాన్ని తెచ్చి అకాడమీ తరఫున ప్రచురించాలని, కానీ ఆపని కాక సతమతమై పోతున్నారు కృష్ణమాచారిగారు - మరం చేత........"

గతుక్కుమన్నారు శాస్త్రిగారు.

"అలాగా?"

"ఆఁ"

"సరే, నే వెళ్ళొస్తానబ్బాయ్. శీఘ్రమేవ ఉన్నత విద్యాఉద్యోగ ప్రాప్తిరస్తు - శ్రమనుకోకుండా ఎలాగో తెముల్చుకుని మా మనవడి ఎస్సేలు కొంచెం దిద్ది ఇవ్వబాబూ! సబ్జెక్ట్ మీద ఈ వయసులో ఇంటరెస్ట్ కలగకపోతే తర్వాత చాలా కష్టం - మొదటి మెట్టు గదా- ఎలిమెంటరీ స్కూలు వారిదే మహోత్తమ బాధ్యత. మరి నా లాంటి ముసలివాళ్ళకి బద్ధకం వదిలించి ఉత్తేజితుల్ని చెయ్యాలంటే మీరూ మీ విద్యార్థులే తగుదురు. ఇంక వస్తానయ్యా!" అంటూ సెలవివారా నవ్వుతూ నిష్క్రమించారు శాస్త్రిగారు.

తర్వాత ఇహ చెప్పేదేముంది....

పదిరోజుల్లో ...

శాస్త్రిగారు వేదాంత గ్రంథం చదివి చక్కని పీఠికరాసి, అకాడమీకి సిఫారసు చేశారు. కృష్ణమాచారి చకచకా థీసిస్ పేపర్స్ దిద్దేసి జనార్ధనరావు కిచ్చేశాడు. జనార్ధనరావు బియ్యే ఎస్సేలు దిద్ది కామేశానికిచ్చాడు. కామేశం వాసు ఎస్సేలు దిద్దటమే కాదు- రోజూ ఆ అబ్బాయిని దగ్గిర కూచోపెట్టుకుని చదువుచెప్పటం మొదలు పెట్టాడు. ★